ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
3
శనివారం 22 జూన్ 2024

గరిష్ఠం 36.0
కనిష్ఠం 25.2

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.40 (122.3596)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.65 (2.71)	197	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.160 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.250

బత్తాయికి కత్తెర

- ఎండల ప్రభావం, నీటి ఎద్దడితో పంట కోల్పోయిన రైతులు
- నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 1.60లక్షల మెట్రిక్‌టన్నుల మేర తగ్గిన ఉత్పత్తి
- నాణ్యత తగ్గడంతో ధర కూడా రాని దుస్థితి
- పెట్టుబడులూ రాక రైతుల ఆవేదన
- ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడి నష్టం



నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని దుగ్గేపల్లిలో నీటిఎద్దడితో వాడిన బత్తాయి తోట

బత్తాయి రైతులు ఈ సీజన్‌లో గడ్డుపరిస్థితి ఎదుర్కొంటున్నారు. యాసంగిలో తీవ్ర ఎండలకు తోడు భూగర్భజలమట్టం పడిపోయి బోరుబావులు ఎండిపోయాయి. అధిక ఉష్ణోగ్రతలతో బత్తాయి పంట నాణ్యత తగ్గడం వంటి కారణాలతో కత్తెర దిగుబడి భారీగా తగ్గింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

కత్తెర దిగుబడి సగటున 80శాతం మేర కోల్పోగా, వచ్చిన పంట కూడా నాణ్యత లేక ధర లభించక రైతులు రెండు రకాలుగా నష్టపోయారు. పెట్టుబడులు సైతం నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లావ్యాప్తంగా కత్తెర పంట దిగుబడి తగ్గడంతో బత్తాయి రైతులు సుమారు రూ.60కోట్ల మేర పెట్టుబడులు కోల్పోయారు. ప్రభుత్వం కనీసం పెట్టుబడులు కోల్పోయిన మేరకైనా పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బత్తాయి రైతులు వేడుకుంటున్నారు.

నీటి ఎద్దడితో తగ్గిన కత్తెర దిగుబడి

నల్లగొండ జిల్లాలో బత్తాయి తోటలు సుమారు 60వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్టప్రాంతాల్లో ఈ తోటల సాగు ఎక్కువగా ఉంది. ఏటా సాగైన తోటల్లో సుమారు 40వేల ఎకరాల్లో యాసంగిలో కత్తెర దిగుబడి వస్తుంది. ఎకరాకు సగటున ఐదు మెట్రిక్ టన్నుల వరకు కత్తెర దిగుబడి వస్తుంది. సగటున ఏటా జిల్లాలో కత్తెర సీజన్‌లో దాదాపు 2లక్షల మెట్రిక్ టన్నుల బత్తాయి దిగుబడి వస్తుంది. కాగా, ఈ ఈ ఏడాది 40వేల మెట్రిక్ టన్నులకు మాత్రమే పరిమితమైంది. భూగర్భజలాలు అడుగంటడంతో తోటలకు నీరందక నీటి ఎద్దడితో కత్తెర పంటను రైతులు కోల్పోయారు. నీటికోసం వేసవిలో రైతులు బోరుబావులు వేయించినా ఫలితం లేకపోయింది. అరకొర నీటితో పాటు, ట్యాంకర్లు, ఇతర ప్రత్యామ్నాయాల ద్వారా నీటిని అందించినా అవి పంటకు ఉపయోగపడలేదు. దీనికి తోడు ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదవడంతో చెట్లు వాడిపోయాయి. దీంతో పూత రాలిపోవడం, కాయలుగా మారినా సైజు ఎదగకపోవడం, కాయలు వాడిపోవడం, కాయల్లో నీరులేకపోవడం వంటి కారణాలతో దిగుబడులు తగ్గడమేగాక, వచ్చిన పంట కూడా నాణ్యతలేకుండా పోయింది. ఏటా ఈ సీజన్‌లో ఎకరాకు కనీసం ఐదు మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చేదని, ఈసారి ఎకరాకు టన్నుకు మించి ఉత్పత్తి రాలేదని, అదీ నాణ్యతలేకపోవడంతో ధర కూడా దక్కలేదని రైతులు వాపోతున్నారు. బత్తాయి నాణ్యత లేకపోవడంతో టన్నుకు రూ.45వేల వరకు ఉండాల్సిన ధర రూ.25వేలకు పడిపోయిందని, దీంతో మరింత నష్టపోయామని రైతులు చెబుతున్నారు. మొత్తంగా ఈ ఏడాది కత్తెర పంట కోల్పోవడంతో రైతులు జిల్లావ్యాప్తంగా సుమారు రూ.500కోట్ల విలువైన పంటను నష్టపోయారు. అదే సమయంలో దిగుబడులు తగ్గడం, ధర లేకపోవడంతో వచ్చిన పంట కూడా గిట్టుబాటు కాలేదని, దీంతో ఎకరాకు సగటున రూ.20వేల వరకు పెట్టుబడులు నష్టపోయామని చెబుతున్నారు. మొత్తంగా కత్తెర పంట కోల్పోవడం, దిగుబడి తగ్గడంతో రైతులు పెట్టుబడిపరంగా సుమారు రూ.60కోట్ల పైచిలుకు నష్టపోయారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం ఊరట కలిగించేలా పరిహారం ఇవ్వాలని బత్తాయి రైతులు కోరుతున్నారు.

12 ఎకరాల తోటలో 10 టన్నుల దిగుబడే వచ్చింది



12 ఎకరాల బత్తాయి తోట ఉంది. ఏటా కత్తెర సీజన్‌లో కనీసం 50 నుంచి 60 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చేది. వేసవి కావడంతో ధర కూడా టన్నుకు రూ.40వేల పైనే ఉండేది. ఈసారి నీటి ఎద్దడి, విపరీతమైన ఎండలతో దిగుబడి పడిపోయింది. కేవలం 10 టన్నుల దిగుబడే వచ్చింది. కాయ ఎదుగదల లేకపోవడం, ఎండమచ్చలు రావడంతో నాణ్యత తగ్గింది. దీంతో ధర కూడా టన్నుకు రూ.20వేలకు మించి రాలేదు. మొత్తంగా గిట్టుబాటు కాలేదు. రూ.3లక్షల వరకు పెట్టుబడి నష్టపోయా.

జె.రమేష్‌రెడ్డి, బత్తాయి రైతు, దుగ్గేపల్లి, త్రిపురారం మండలం



వాడుపట్టిన బత్తాయి చెట్లు



- ప్రభుత్వం మారడంతో ప్రశ్నార్థకంగా మారిన పథకం
- ఏటా మత్స్యకారులకు ఉచితంగా చేపలు పంపిణీ
- ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తికావాలి
- ఇంకా మొదలు పెట్టని ప్రభుత్వం
- మత్స్యకారుల ఎదురుచూపు

చేపల పంపిణీపై నీలి నీడలు

చేప పిల్లల పంపిణీ కోసం మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు. అయితే ప్రతీ సంవత్సరంలాగే ఈసారి కూడా ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా, ఆ వైపు అడుగులు పడకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో చేప పిల్లల పంపిణీపై సందేహం నెలకొంది.


(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

చెరువులు, కుంటలను నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. వానాకాలం ప్రారంభం కావడంతో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురవడంతో నేల తడిసింది. భారీ వర్షాలు కురిసిన పక్షంలో చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంది. వాతావరణ శాఖ కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లోని చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతోంది. జిల్లాలో మొత్తం 1,050 చెరువులు, కుంటలున్నాయి. జిల్లా యంత్రాంగం గుర్తించిన చెరువుల్లో ప్రతీ సంవత్సరం చేపలను వదిలి పెడతారు. అయితే జిల్లాలో మొత్తం 706 చెరువులతోపాటు 22 మూసీ పరివాహక ప్రాంతాల్లోని కుంటల్లో చేపల పిల్లలను వదిలేందుకు ప్రతిఏటా జిల్లా మత్స్యశాఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తుంది. అయితే ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈసారి 100శాతం సబ్సిడీపై చేపపిల్లలను పంపిణీ చేస్తారా? లేదా? అనే అంశంపై స్పష్టత లేదు. ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి కూడా జిల్లా యంత్రాంగానికి ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. ప్రతీ సంవత్సరం వర్షాకాలానికి ముందుగానే టెండర్లు వేసి... జూన్‌నుంచి ఆగస్టులోగా పంపిణీ పూర్తి చేసేవారు. కానీ ఇప్పటివరకు ఈ పథకం కొనసాగింపుపై ముందుకు సాగడంలేదు. దీంతో మత్స్యకారులు, అధికారులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఏటా 2.78కోట్ల చేపపిల్లల పంపిణీ

జిల్లాలో ప్రతీ సంవత్సరం దాదాపు 2.78కోట్ల చేపపిల్లలను, 38.20లక్షల రొయ్యల సీడ్స్‌ను పంపిణీ చేసేవారు. జిల్లాలో మొత్తం 171 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, 15 మహిళా మత్స్యపారిశ్రామిక సంఘాలు, ఒక మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ పథకం కింద 2023-24లో జిల్లాలోని 706 చెరువుల్లో 2,78,72,771 చేపపిల్లలను, 41 చెరువుల్లో 38.20లక్షల రొయ్యపిల్లలను వదిలారు. ఈ సంఘాల్లో మొత్తం 10,345 మంది మత్స్యకారులున్నారు. వీరంతా కూడా చేపలు, రొయ్యలను విక్రయించి జీవనం గడుపుతున్నారు. అయితే ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తికావాల్సి ఉండేది. ప్రతి సంవత్సరం చేపపిల్లల పంపిణీకోసం అధికారులు కాంట్రాక్టర్ల నుంచి టెండర్లను ఆహ్వానించేవారు. తక్కువ ధరకు కోట్ చేసిన వారికి పంపిణీ బాధ్యత అప్పగించే వారు. పొరుగు రాష్ట్రాల నుంచి సీడ్ జిల్లాకు చేరేలా చర్యలు తీసుకునే వారు. సాధారణంగా మే నుంచి జూన్ మొదటి వారంలోగా టెండర్ల ప్రక్రియ పూర్తికావాలి. జూన్‌లో మూడువారాలు గడుస్తున్నప్పటికీ, చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కిలో పరిమాణంలో చేపలు పెరగాలంటే కనీసం ఆరు నెలలు సమయం పడుతుంది. భారీ వర్షాలు కురవగానే చేపలు పంపిణీ చేస్తే.. పెరుగుదల ఉంటుంది. ఆలస్యమైన పక్షంలో చేపలు తక్కువ సైజులో పెరిగే అవకాశం ఉంటుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపపిల్లల పంపిణీపై తొందరగా నిర్ణయం తీసుకుని, మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎలాంటి ఆదేశాలు అందలేదు



మత్స్యకారులకు ఉచితంగా చేపల పిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ఈ పథకంపై ఇప్పటివరకు ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు విడుదల కాలేదు. ఈ కారణంగా చేపల పంపిణీపై ఎలాంటి ప్రక్రియను మొదలుపెట్టలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే ఈ పక్రియను ప్రారంభిస్తాం.

● రాజారాం, జిల్లా మత్స్యశాఖ అధికారి



ఆస్పత్రులపై కలెక్టర్ నజర్

- పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం
- వారం రోజుల్లో ఆస్పత్రిలో పరిస్థితులు మెరుగుపడాలని ఆదేశం
- పనిచేయలేకపోతే తప్పుకోవాలని హెచ్చరిక
- జిల్లా ప్రధానాస్పత్రిలో సీసీ కెమెరాలతో నిఘా



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ సీ.నారాయణరెడ్డి

నల్లగొండ, జూన్ 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న సీ.నారాయణరెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు నాణ్యమైన వైద్యసేవలందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. బాధ్యతలు స్వీకరించిన మూడో రోజే జిల్లా కేంద్ర ప్రధానాస్పత్రిని తనిఖీచేసి రోగుల వద్ద నుంచి డబ్బు వసూలుచేసిన ఇద్దరు వార్డ్‌బాయ్‌లను సస్పెండ్ చేశారు. తాజాగా, శుక్రవారం ఆస్పత్రి అధికారులు, డాక్టర్లు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా వైద్యశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. లోపాలను నిర్మొహమాటంగా ప్రస్తావించిన కలెక్టర్, తక్షణం వాటన్నింటినీ సరిచేసుకోవాలని హెచ్చరించారు. అంతా బాధ్యతగా పనిచేయాలని, సమయపాలన పాటించాలని, అందుకు జిల్లా స్థాయి అధికారులతో రోజూ పరిశీలన ఉంటుందని తేల్చిచెప్పారు. శానిటేషన్ మొదలు మందుల సరఫరా వరకు ఎలాంటి లోపాలు లేకుండా ఉండాలని, వారం రోజుల్లో మార్పు కనిపించాలని స్పష్టం చేయడమేగాక మార్గదర్శనం చేశారు. వేతనం తీసుకునేవారంతా బాధ్యతతో పనిచేయాలని, చేయలేనివారు స్వచ్ఛందంగా తప్పుకోవాలని హెచ్చరించారు.

రోజుకో జిల్లాస్థాయి అధికారి పరిశీలన

జిల్లా ఆస్పత్రిలో అటెండర్ మొదలు హెచ్‌వోడీ (విభాగాధిపతి) వరకు పనిలో బాధ్యులను చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ప్రతీ వారం ఆస్పత్రిని స్వయంగా తనిఖీచేయడంతోపాటు అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ప్రతి రోజూ రెండు గంటలు ఈ ఆస్పత్రికి కేటాయించేలా నిర్ణయించారు. రోజూ ఓ జిల్లాస్థాయి అధికారి ఆస్పత్రిని తనిఖీచేసి వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరుతోపాటు సేవల తీరుని పరిశీలించి కలెక్టర్‌కు నివేదించనున్నారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు, హెచ్‌వోడీ ఛాంబర్లలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయించడం ద్వారా పారదర్శక సేవలు సాధ్యమని నిర్ణయించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి ఆస్పత్రిని పర్యవేక్షించనున్నారు.

మౌలిక వసతుల మెరుగుకు తక్షణ ఆదేశాలు

జిల్లా ఆస్పత్రిలో మౌలికవసతులు లేవని మెడికల్ సిబ్బంది తెలియజేయడంతో స్పందించిన కలెక్టర్ వాటన్నింటినీ కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లకు నిరంతర నీటి సరఫరా, అవసరమైన మేర ప్రతి రోజూ తాగునీటిని అందించాలని అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ కొనసాగేలా, మరమ్మతులు చేసేలా విద్యుత్ అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో పడకలు, వీల్‌ఛైర్స్ బెడ్‌షీట్లు అందుబాటులో ఉంచాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఫ్యాన్లకు తక్షణ మరమ్మతులు చేయాలని, రోగులకు ఆస్పత్రిలో చక్కటి వాతావరణం ఉండేలా చర్యలుండాలని ఆదేశించారు.

లంచం అడిగితే జైలుకే

ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో రోగులవద్ద గానీ, రోగుల సహాయకుల వద్ద గానీ సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే తక్షణం వారిని జైలుకు పంపిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న మూడో రోజే ఆస్పత్రిని తనిఖీ చేసిన సమయంలో వార్డ్‌బాయ్స్ రోగుల సహాయకుల వద్ద లంచం తీసుకున్న విషయం ఆయన దృష్టికి రాగా, వారిని అక్కడికక్కడే సస్పెండ్ చేశారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కలెక్టర్ సిబ్బంది మొదలు ఏ స్థాయి వారైనా లంచాలు ఆశిస్తే జైలు తప్పదని కఠినంగా హెచ్చరించారు. ఆస్పత్రిలో పారిశుధ్యం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని కలెక్టర్ హెచ్చరించారు.

స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రాధాన్యం

● కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 21: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా చేపట్టే పనులు, పథకాలు ప్రజల భాగస్వామ్యంతో జరగాలని, స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ, పంచాయతీశాఖల ద్వారా చేట్టిన పనులు, పథకాలపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హతగల ప్రతీ ఒక్కరికి జాబ్ కార్డు అందించి నూరుశాతం పనిదినాలు కల్పించి జిల్లాలో ప్రగతిని పరుగులు పెట్టించాలన్నారు. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో ఐదు యూనిట్ల చొప్పున గుర్తించి పనుల నివేదికను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. జలశక్తి అభియాన్ కార్యక్రమం ద్వారా జల వనరులను జియోట్యాగ్ ద్వారా గుర్తించాలన్నారు. ప్లాంటేషన్‌కు సంబంధించి మండల, గ్రామస్థాయిలో పూర్తిస్థాయిలో నివేదికలను అందజేయాలన్నారు. హైదరాబాద్, విజయవాడ హైవేలలో రోడ్డు మధ్యలో పెంచిన మొక్కల వివరాల నివేదికను తయారు చేసి, వాడిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటి కాలుష్య రహిత వాతావరణాన్ని పెంపొందించాలన్నారు. మీసేవా కేంద్రాల నిర్వహణకు మొదటగా మహిళా సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

పారిశుధ్య నిర్వహణకు చర్యలు

జిల్లాలో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనుల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పర్యవేక్షణల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలన్నారు. నూతన గ్రామపంచాయితీ భవనాలు, మరుగుదొడ్ల ఏర్పాటు, పంచాయతీల్లో సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

రైతులకు వానాకాలంలో సాగు చేయాల్సిన వరి, పత్తి, కంది, పెసర మొదలైన పంటలకు సరిపడా విత్తనాలు అందేలా చూడాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు డీలర్ల వద్ద పత్తి విత్తనాలు 35,090 ప్యాకెట్లు, వరి విత్తనాలు 17,312 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, యూరియా 35,357 ఎంటీఎస్, డీఏపీ 2,328 ఎంటీఎస్, కాంప్లెక్స్ ఎరువులు 17,209 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మధుసూదన్‌రాజు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో యోగాసనాలు వేస్తున్న సూర్యాపేట అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు



సూర్యాపేటలో యోగాసనం వేస్తున్న చిన్నారి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లావ్యాప్తంగా యోగా దినోత్సవం

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 21: సూర్యాపేట, కోదాడలో జరిగే డీఎడ్, హెచ్‌డబ్ల్యూవో పరీక్షలు సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి ఆమె మాట్లాడారు. జూన్ 24వతేదీ నుంచి 29వ తేదీ వరకు కోదాడ, సూర్యాపేటలో 2,780 మంది అభ్యర్థులు ఉదయం, మధ్యాహ్నం పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరీక్ష విభాగం పర్యవేక్షకుడు పద్మారావు, ఏవో సుదర్శన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇసుకను తరలించాలి

శాలిగౌరారం, జూన్ 21: నిబంధనల మేరకే ఇసుకను తరలించాలని నల్లగొండ ఆర్డీవో రవి, డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద ఉన్న ఇసుక రీచ్‌ను వారు పరిశీలించి, మాట్లాడారు. అక్కడ ఉన్న ఎక్స్‌కవేటర్లు, లారీలు, వే‌బ్రిడ్జిల దగ్గరికి వెళ్లి సిబ్బందిని ఇసుక తరలింపు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇసుక తరలింపు నిబంధనల మేరకే జరగాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. రీచ్ వద్ద లారీలు ఎక్కువసంఖ్యలో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో ఆలస్యం జరుగుతుందని అందువల్లే లారీలు ఆగుతున్నాయని సిబ్బంది సమాధానమిచ్చారు. వారివెంట తహసీల్దార్ అన్వర్ హుస్సేన్, సీఐ శ్రీనివాస రెడ్డి, ఆర్ఐ నవీన్ కుమార్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



ఇసుక రీచ్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో రవి, డీఎస్పీ శివరాంరెడ్డి

హక్కుల కమిషన్‌కు నివేదిక అందజేస్తాం

మిర్యాలగూడ రూరల్, జూన్ 21: మిల్లుల తనిఖీలకు సంబంధించిన వివరాలను జాతీయ మానవహక్కుల కమిషన్‌కు నివేదిక రూపంలో అందజేస్తామని పర్యావరణ శాస్త్రవేత్తలు పురుషోత్తంరెడ్డి, రామకృష్ణ, ఇంజనీర్లు సజీనాబేగం, శంకర్‌లు తెలిపారు. యాద్గార్‌పల్లి గ్రామంలోని రైస్‌మిల్లుల ద్వారా పర్యావరణం కలుషితం అవుతుందని ఓ వ్యక్తి జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని, కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం తనిఖీ చేపటినట్లు వారు తెలిపారు. మిల్లుల పనితీరు, పొగ విడుదల, ఇతర అంశాలను వారు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఇప్పటికైనా కాలుష్యాన్ని వెదజల్లుతున్న మిల్లులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.



రైస్‌మిల్లుల్లో వివరాలు సేకరిస్తున్న శాస్త్రవేత్తలు

ఉపసంహరించకుంటే ఉద్యమిస్తాం

● రింగ్‌రోడ్డు బాధితులతో కలిసి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూన్ 21: రింగ్ రోడ్డు కోసం మూడో ప్రతిపాదనను ఉపసంహరించుకోకపోతే ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు ఏర్పాటులో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఆయన బాధితులతో కలిసి నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ తన అనుచరుల కోసం మంత్రి ప్లాన్-3 ఎంచుకున్నారని ఆరోపించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజల తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తన నిర్ణయంతో మూడు వేల కుటుంబాలకు గూడు లేకుండా చేసి, బాధితుల జీవితాలతో చెలగాటం ఆడటం మంచిది కాదని భూపాల్‌రెడ్డి అన్నారు. 15 రోజుల్లో మూడో ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని లేకుంటే బాధితులతో కలిసి పాదయాత్ర చేస్తానన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ స్థల పరిశీలన చేసి ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు కంచనపల్లి రవీందర్‌రావు, జమాల్ ఖాద్రి, కౌన్సిలర్ మారగోని గణేష్, మెరుగు గోపి, శంషోద్దీన్, గంజి రాజేందర్, వజ్జే శ్రీనివాస్, దొడ్డి రమేష్, సైదిరెడ్డి, బాధితులు పాల్గొన్నారు.

నేడు నల్లగొండలో బీజేపీ మహాధర్నా

నల్లగొండ : నల్లగొండ బైపాస్‌కు సంబంధించి మూడో అలైన్‌మెంట్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడో అలైన్‌మెంట్‌తో మూడు వేల కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో జరిగే ధర్నాకు బాధితులు, ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

వెంబడించారు.. పట్టుకున్నారు.

దామరచర్ల, జూన్ 21: ఓ వ్యక్తి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన ఇద్దరు విద్యార్థులను వెంబడించి గ్రామస్థులు పట్టుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. దామరచర్లకు చెందిన గుండా బాలసైదయ్య కిరాణదుకాణం నిర్వహిస్తున్నాడు. మిర్యాలగూడకు చెందిన 17 ఏళ్ల బాలుడు వచ్చి మంచినీళ్ల బాటిల్ అడిగాడు. బాటిల్ లేదని సమాధానం చెబుతుండగానే బాలసైదయ్య మెడలోని బంగారు గొలుసును లాక్కొని అప్పటికే సమీపంలో స్కూటీపై సిద్ధంగా ఉన్న మిర్యాలగూడకు చెందిన 17ఏళ్ల మరో బాలుడితో కలిసి పారిపోయాడు. బాలసైదయ్య కేకలు వేయడంతో గమనించిన చుట్టుపక్కల వారు స్కూటీని వెంబడించి మిర్యాలగూడ మండలం కిష్టాపురం సమీపంలో ఇద్దరు బాలురను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చోరీకి పాల్పడిన ఇరువురు మిర్యాలగూడలోని ఇంటర్ చదువుతున్నట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై ఇంకా కేసు నమోదుకాలేదు.

ఎనిమిది కిలోమీటర్లు వెంటబడి..


లారీ డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి, జూన్ 21 : తప్పించుకుని వెళ్తున్న లారీని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఎనిమిది కిలోమీటర్ల వరకు వెళ్లి డ్రైవర్‌తో పాటు లారీని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మధ్య శుక్రవారం జరిగింది. దేవరకొండ ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా కొండమల్లేపల్లి వైపు వెళ్తున్న లారీని ఆపే ప్రయత్నం చేశారు. డ్రైవర్ నిలపకుండా వెళ్లిపోయాడు. లారీ వెనక భాగంలో పాత బైక్‌లు ఉండటంతో అనుమానం వచ్చిన పోలీసులు లారీని వెండించారు. ఎనిమిది కిలోమీటర్ల దూరం వచ్చాక కొండమల్లేపల్లి పట్టణం నుంచి సాగర్‌కు వెళ్లే మార్గం వద్ద లారీని పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపు తీసుకుని దేవరకొండకు తీసుకెళ్లారు. ఎస్ఐ సైదులు వివరిస్తూ దేవరకొండలో తప్పించుకుని వస్తుండగా వెంబడించి పట్టుకున్నామన్నారు. స్టేషన్ తరలిస్తున్నామని,విచారించాక వివరాలు వెల్లడిస్తామన్నారు.

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగింత

నేరేడుచర్ల: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో ఇంటి యజమాని దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ రవీంద్రనాయక్, ఇంటి యజమాని భూపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల పట్టణం శివాలయంలో బైపాస్ రోడ్డులో ఉంటున్న యలంచెర్వు భూపాల్‌రెడ్డి, భార్య నాగలక్ష్మి ఇంటికి తాళం వేసి పాలకవీడు గ్రామంలోని పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటకు చెందిన గొల్ల మహేష్, పవన్, గుంటూరు జిల్లా కారంపూడికి చెందిన బాబావలి కలిసి భూపాల్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇద్దరు బయట ఉండగా మహేష్ ఇంటితాళం పగులగొట్టి లోపలికివెళ్లాడు. పరిసరాలను గమనించిన మిగిలిన ఇద్దరు లోనికి వెళ్లి బీరువాని తెరిచి రూ.80వేల నగదు, రెండు తులాల మూడు బంగారు ఉంగరాలు, దిద్దులు 2 జతలు, ముక్కు పుడకలు దొంగిలించారు. ఇంతలోనే భూపాల్‌రెడ్డి, నాగలక్ష్మిలు రావడంతో ఇద్దరు పారిపోగా మహేష్‌ను పట్టుకున్నారు. స్థానికులు వచ్చి అతడిని చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు. భూపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు.

సమాచారం

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ:ఉదయం 3.30నుంచి4వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:**4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
తిరువారాధన:సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
సహస్రనామార్చన:రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం:ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు:ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..
భువనగిరి అర్బన్

చెర్వుగట్టు ఆలయ వేళలు

ఉదయం: 5.00 గంటలకు తెరుస్తారు
సుప్రభాతసేవ మరియు నాదస్వరం: ఉదయం 5.00 నుంచి 5.30 వరకు
నిజాభిషేకం: ఉదయం 5.30నుంచి 6.30గంటల వరకు
దర్శనాలు:ఉదయం 6.30గంటల నుంచి 12గంటల వరకు
నివేదన: మధ్యాహ్నం 12.00 గంటలకు మహానివేదన
దర్శనం: 12.10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
మూసివేత: మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేత
సాయంత్రం: 3గంటలకు తెరుచుకోనున్న ఆలయం
దర్శనాలు:సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు దర్శనాలు
ద్వార బంధనం: సాయంత్రం 7.30 గంటలకు ప్రదోశకాల పూజలు మహా ఫల నివేదన, హారతి అనంతరం ద్వార బంధనం
● నార్కట్‌పల్లి

నేడు డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక

నల్లగొండ, జూన్ 21: నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం(డీసీఎంఎస్) చైర్మన్‌ను శనివారం ఎన్నుకోనున్నారు. ఇప్పటికే జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి అయిన డీ శ్రీనివాస్ షెడ్యూల్ విడుదల చేశారు. ఈ మేరకు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11 గంటల నుంచి 11.30 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు నామినేషన్ ఉపసంహరణ ఉంటుంది. ఒకవేళ ఒకే నామినేషన్ వస్తే చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎవరైనా అభ్యర్థులు పోటీలో ఉంటే మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారు. అయితే ఇప్పటికే చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు అధికార పార్టీ కసరత్తు పూర్తిచేసింది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చండూరురూరల్, జూన్ 21: పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లా చండూరు ఎస్ఐ సురేష్ తెలిపారు. బంగారిగడ్డ గ్రామశివారులోని నలపరాజు అంజయ్య పొలంలోని గుడిసెలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందని, ఆ మేరకు తన సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతూ నలపరాజు అంజయ్య, కొన్‌రెడ్డి జీవన్‌కుమార్, ఇరిగి నరేష్, మేడిపల్లి బిక్షం, బోడ అంజయ్య, ఆది సైదులు, మాదగోని రాజు, పాలెం స్వామిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.2,980 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఎనిమిది బైక్‌లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నెంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు : ఎస్పీ

నల్లగొండ, జూన్ 21:నెంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఇప్పటివరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా నెంబర్ ప్లేటు లేని 551వాహనాలపై కేసులు నమోదు చేశామని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో చాలామంది వాహనదారులు నెంబర్ ప్లేటులు లేకుండా ప్రయాణం చేస్తున్నారని, తమ వాహనాల నెంబర్ ప్లేట్లు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఉండాలన్నారు. కొందరు నెంబర్ ప్లేట్స్ లేకుండా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. నెంబర్ ప్లేటు ఏర్పాటు చేసుకోకపోతే కేసు నమోదు చేస్తామన్నారు.

13 వాహనాలు సీజ్

త్రిపురారం జూన్ 21: నెంబరు ప్లేట్స్ లేని 13 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు నల్లగొండ జిల్లా త్రిపురారం ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో నెంబర్ ప్లేట్ వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ఎవరైనా వాహనాలకు నెంబర్ ప్లేట్స్ లేకుండా నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నకిరేకల్, జూన్ 21 : నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని సంతోష్‌నగర్‌లో చోరీ జరిగింది. నారగోని సుదర్శన్ ఇంట్లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం మధ్యాహ్నం ఇంటికి తాళాలు వేసి వైద్యపరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి శుక్రవారం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి , ఇంట్లో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, జూన్ 21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి సువర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధినీ శ్రీరామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.23,34,678 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఉద్దీపనతో విద్యార్థుల జీవితాల్లో వెలుగు: వీరేశం

నకిరేకల్, జూన్ 21 : ఉద్దీపన విద్యతో విద్యార్థుల జీవితాల్లో వెలుగు నిండుతాయని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో శుక్రవారం ఉద్దీపన ఉచిత ఆంగ్ల విద్య కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ ఏడాది నుంచి ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు ఆంగ్ల విద్య ప్రారంభిస్తామన్నారు. 10 పదేళ్ల నుంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కరోనా తర్వాత కొన్నిపాఠశాలలకే ఉద్దీపన పరిమితం అయ్యిందన్నారు. కాగా నకిరేకల్‌లోని విద్యుత్ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఐఎన్‌టీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇనుగాల శ్రీధర్, అధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు జే అమర్‌కుమార్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, కోశాధికారి హరిప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సమ్మిరెడ్డి, ఎండీ అబ్బాస్, పాండు, శంకరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఉద్దీపన ఉచిత ఆంగ్లవిద్య కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

వివాహిత ఆత్మహత్య


జానకమ్మ(ఫైల్)

తిప్పర్తి, జూన్ 21 : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో శుక్రవారం వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ డీ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన తీగల జానకమ్మ(38) కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. భర్త వెంకన్నతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె నకిరేకల్‌లోని గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా భర్త ఇండ్లూరు గ్రామం వద్ద చిన్నహోటల్‌లో మాస్టర్‌గా చేస్తున్నాడు. కుమారుడు అదే గ్రామంలోని పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో కుమారుడు తల్లికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. దీంతో పక్కింటి వారికి ఫోన్ చేయగా వారు ఇంట్లోకి వెళ్లి చూడగా జానకమ్మ ఉరివేసుకుని కనిపించింది. జానకమ్మ తల్లి బచ్చలకూరి లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని ఎస్ఐ రాజు తెలిపారు.

పత్తి కంటైనర్ నుంచి పొగలు

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 21: పత్తి లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ నుంచి ఆకస్మికంగా పొగలు రావడంతో పత్తి పాక్షికంగా దగ్ధమైంది. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామ సమీపంలో ఈ సంఘటన జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారి అబ్దుల్ అమీద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడ నుంచి గుజరాత్ రాజ్‌కోటికి పత్తి లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ మాసాయిపేట గ్రామ సమీపానికి చేరుకోగానే ఆకస్మికంగా పొగలు వచ్చాయి.గమనించిన స్థానికులు కంటైనర్‌ను ఆపి డ్రైవర్‌కు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది పొగలు అదుపుచేయగా పత్తి పాక్షికంగా దగ్ధమైంది. పత్తిని పూర్తిగా తొలగించామని, వాహనానికి ఎలాంటి నష్టం కలగలేదని తెలిపారు.


పొగలు వచ్చిన కంటైనర్ నుంచి పత్తిని అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

హెడ్‌కానిస్టేబుల్ చీపురు పని

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో ఘటన

పెన్‌పహడ్, జూన్ 21: ఆ స్టేషన్‌లో 19 మంది ఉన్నారు, రోజూ ఎంతోమంది వచ్చిపోతుంటారు.. స్టేషన్‌లో అపరిశుభ్ర వాతావరణం చూడలేక హెడ్‌కానిస్టేబుల్ చీపురు పని చేస్తున్నాడు. స్టేషన్‌కు వచ్చి రోజు విధులతో పాటు పారిశుధ్య పనులూ చేస్తున్నాడు. ఆ హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి కాగా సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన పనిచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఉండే పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ కానిస్టేబుల్స్ కలిపి మొత్తం 19 మంది వరకు ఉన్నారు. నిత్యం కేసుల నిమిత్తం ఈ స్టేషన్‌కు చాలామందే వచ్చిపోతుంటారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో స్వీపర్‌ను నియమించలేదు. దీంతో రోజువారిగా దుమ్ముధూళి పేరుకుపోతుంటుంది. ఇది చూసిన హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి చీపురు అందుకున్నాడు. స్టేషన్‌లో రెండు గదులు, హాల్‌ను శుభ్రం చేసేవాడు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన కొందరు ఫొటో తీసి, యాదగిరిని ప్రశ్నించారు. పారిశుధ్య పనులు చేయడంలో ఎలాంటి తప్పులేదని హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి బదులిచ్చారు. రెండేళ్ల క్రితం సూర్యాపేట నుంచి పదోన్నతిపై హెడ్ కానిస్టేబుల్‌గా పెన్‌పహాడ్ స్టేషన్‌కు వచ్చారు. దీనిపై ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ ఓ మహిళా స్వీపర్ ఉన్నారని, ఆమె రాని రోజుల్లో యాదగిరి స్టేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్నాడని, మన పని మనం చేసుకుంటే తప్పేమీ లేదన్నారు.


హాల్‌ను శుభ్రం చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి

కష్టపడి చదివి.. పైలెట్‌గా ఎదిగి

● నౌకాదళంలో పైలెట్‌గా అరవింద్‌నాయక్

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి తన లక్ష్యాన్ని చేరుకున్నాడు నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని సీతరాంతండాకు చెందిన కుమార్, బుజ్జి దంపతుల కుమారుడు కొర్ర అరవింద్ చౌహాన్‌నాయక్. తండ్రి చిన్నప్పుడు మృతిచెందగా తల్లి తండాలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తూ కుమారుడిని చదివించింది. తల్లి బుజ్జి, మేనమామ, బంధువుల ప్రోత్సాహంతో కష్టపడి చదివిన అరవింద్ భారత నౌకాదళంలో పైలెట్‌గా ఎదిగారు. దేవరకొండలోని ఎస్‌పీఆర్ పాఠశాలలో 8వ తరగతి వరకు చదువుకొని ఉపాధ్యాయుల ప్రోత్సహంతో 2013లో విజయనగరం జిల్లాలోని సైనిక్ స్కూల్‌లో సీటు సాధించాడు. సైనిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం, శిక్షణ అనంతరం 2016 సెప్టెంబరులో ఆలిండియా స్థాయిలో యూపీఎస్‌సీ నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమి పరీక్షలో రాష్ట్రస్థాయిలో 170వ ర్యాంక్ సాధించాడు. నాలుగు వేల మందిని ఇంటర్వ్యూకు పిలవగా, అందులో 300మంది ఎంపికయ్యారు. అందులో అరవింద్ చౌహాన్ ఒకరు. మైసూరులో నిర్వహించిన ఇంటర్వ్యూలో నౌకాదళంలోకి అర్హత సాధించాడు. అప్పటి ఆయన వయస్సు 21ఏళ్లే. మూడేళ్ల పాటు పూణెలో శిక్షణ పొందుతూనే బీటెక్ పూర్తి చేశాడు. కేరళలోని ఇండియన్ నావెల్ అకాడమీలో ఏడాది శిక్షణ తీసుకొని 2021లో భారతీయ నౌకాదళంలో గ్రూపు-1 స్థాయి సబ్ లెఫ్టినెంట్‌గా ఎంపికయ్యాడు. నౌకాదళంలో అధికారిగా కొనసాగుతూ పైలెట్‌గా పదోన్నతి పొందాడు. చదువుతోపాటు తనను ప్రోత్సహించిన కుటుంబసభ్యులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనతండాల నుంచి విద్యార్థులు కష్టపడి చదివి దేశ రక్షణ కోసం సైన్యంతోపాటు నౌకాదళంలో చేరి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అరవింద్ కోరారు.


అరవింద్‌నాయక్

● దేవరకొండ

ఐదేళ్లలో లక్ష మొక్కలు నాటించి..

● పచ్చదనం విస్తరణే లక్ష్యంగా ముందుకెళ్తున్న ఉపాధ్యాయుడు మణిరాజ్

పచ్చదనం విస్తరణే లక్ష్యంగా ముందుకుసాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంల ఆవాస గ్రామ కొత్తగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆదిమళ్ల మణిరాజ్. ఐదేళ్లలో లక్షకు పైగా మొక్కలు నాటారు.తాను చదువుకునే రోజుల్లో వృక్ష శాస్త్రంలోని పాఠమే అతడిని మొక్కలు నాటేందుకు ప్రేరేపించింది. ఎంఎస్సీ జియోగ్రఫీ శాస్త్రంలోని 'ప్రపంచ వృక్ష సంపద' అనే పాఠ్యాంశంలో ప్రపంచ వ్యాప్తంగా అటవీసంపదపై వివరణాత్మక విషయాలు పొందుపర్చాయి. అందులో భాగంగానే రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం ఎంత, ఎంత ఉండాలి, అటవీ సంపద పెంచకుంటే కలిగే దుష్పరిణామాలనే అంశాలపై స్ఫూర్తి పొందిన ఆయన మొక్కలు నాటాలని సంకల్పించారు. 2017 అక్టోబరు 18న క్లీన్ హోం-గ్రీన్ హోం పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. అప్పటి నుంచి మొక్కలను నాటడం ప్రారంభించారు. నీడ, పండ్లనిచ్చే మొక్కలను నాటగా అవి నేడు వృక్షాలయ్యాయి. పర్యావరణంపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించి 'ఇది నా చెట్టు' అనే నినాదంతో వారి పేరు మీదే మొక్కలు నాటిస్తున్నారు. ఔత్సాహికుల ఆర్థిక సాయంతో నాటిన కొన్నిమొక్కలకు ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయించారు. ఈ వర్షాకాలంలో కనీసం 10వేల మొక్కలు నాటడడమే లక్ష్యమని మణిరాజ్ పేర్కొంటున్నారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తానని తెలిపారు.


మొక్క నాటుతున్న మణిరాజ్

● నార్కట్‌పల్లి

యోగాతోనే ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కోర్టుల్లో యోగాసనాలు వేశారు. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యానికి తోడ్పటుతుం దని పలువురు వక్తలు తెలిపారు. యోగాస నాలను దైనందిక దిన చర్యలో భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. కోదాడలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాతులూరి హనుమంత రావు ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో యోగాసనాలు వేయించారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


తిరుమలగిరి పీహెచ్‌సీలో యోగా చేస్తున్న డీఎంహెచ్‌వో


కోదాడలో యోగా చేస్తున్న జడ్జిలు శ్యాంసుందర్, భవ్య


పెన్‌పహాడ్‌లో యోగా చేస్తున్న వైద్య సిబ్బంది


మఠంపల్లిలో 'ఉపాధి' కూలీలతో యోగాసనాలు వేయిస్తున్న అధికారులు


నూతనకల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు


నేరేడుచర్ల మండల కేంద్రంలో యోగా చేస్తున్న విద్యార్థులు


యోగా చేస్తున్న న్యాయమూర్తులు శ్యాంకుమార్, మారుతీప్రసాద్


నడిగూడెం కస్తూర్బా పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు


అర్వపల్లిలో యోగా చేస్తున్న విద్యార్థులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

సూర్యాపేట అర్బన్, జూన్ 21: జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ చలసాని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెల్త్‌కార్డులు పనిచేయకపోవడం, ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో నిరుపేద జర్నలిస్టులకు అన్యాయం జరిగిందన్నారు. జర్నలిస్టుల సమస్యపై రాష్ట్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం చలసాని శ్రీనివాసరావు జర్నలిస్టులు సన్మానించారు. కార్యక్రమంలో బంటు కృష్ణ, బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయ్, ఎడ్వర్డ్, చందన్, ప్రవీణ్, కందుల నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

తిరుమలగిరి రూరల్, జూన్ 21: ఆయిల్‌పామ్ తోటలతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి తీగల నాగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపాముల గ్రామంలో ఆయిల్‌ఫామ్ తోటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో సాగువుతున్న ఆయిల్‌ఫామ్ తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారి వి.స్రవంతి, ఏఈవో వెంకట్‌రెడ్డి హరీష్ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సోమమ్మ మృతి

గరిడేపల్లి, జూన్ 21: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కందుల సోమమ్మ మండలంలోని వెలిదండ గ్రామంలో శుక్రవారం మృతి చెందారు. కమ్యూనిస్టు నాయకుడైన ఆమె భర్త ఈనయ్య గతంలోనే మృతి చెందారు. సోమమ్మ మృతదేహంపై సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సోమమ్మ మృతి సీపీఐకి తీరనిలోటని అన్నారు.

స్నేహితుడికి రూ.2.50లక్షల ఆర్థికసాయం

నేరేడుచర్ల, జూన్ 21: స్నేహితుడి వైద్యం కోసం రూ.2.50లక్షలు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటారు. మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన కొంజేటి సురేష్ బతుకుదెరువు కోసం ఖమ్మం వెళ్లి వ్యాపారం చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు బలమైన గాయం తగిలి మెదడులో రక్తం గడ్డ కట్టింది. దీంతో సురేష్ కోమాలోకి వెళ్లాడు. రూ.30లక్షలు ఖర్చుచేసినా జబ్బు రికరవరీ రానందున స్నేహితుల ద్వారా నేరేడుచర్లకు చెందిన యారవ సురేష్, న్యాయవాది సుంకరి క్రాంతికుమార్ రూ.2.50లు సేకరించి, శుక్రవారం ఖమ్మంలోని సురేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య ఏడీఎంఎస్ బైక్ షోరూం అధినేత అర్నెం బుచ్చిరెడ్డి, రామకృష్ణ, చిన్నపల్లి శ్రీనివాస్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.10.75లక్షలు పలికిన కౌలు వేలం

కోదాడ రూరల్, జూన్ 21: మండలంలోని తమ్మరబండపాలెంబాలాజీవెంకటేశ్వర స్వామి దేవాలయం భూముల కౌలు వేలం డబ్బుల లెక్కలు చెప్పాలని కౌన్సిలర్ సామినేని నరేష్, సీపీఐ నాయకుడు బొల్లు ప్రసాద్ కోరారు. శుక్రవారం ఆలయ భూముల కౌలు వేలానికి దేవాదాయ శాఖ అధికారులు రాగా, ఈవో చలపతిని ప్రశ్నించారు. 25 ఎకరాలకు రూ.10.75 లక్షలకు రైతులు వేలం పాడారు. గత ఏడాది కన్నా రూ.3.50లక్షలు అధికంగా వచ్చింది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఈఓ తుమ్మల వెంకట చలపతి, దేవస్థానం సిబ్బంది శంభిరెడ్డి, అర్చకులు ముడుంబై లక్ష్మణాచార్యులు, ముడుంబై వేణుగోపాలచార్యులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయాలి

కోదాడ టౌన్, జూన్ 21: కోదాడ పోస్టాఫీస్‌లో సమాచారం హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయాలని కోదాడ నియోజకవర్గ సమాచార హక్కు చట్టం ఉద్యమకారుడు, స్ఫూర్తి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఎండీ మజహర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కోదాడలో హెడ్ పోస్ట్‌మాస్టర్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పోస్టాఫీస్‌లో సమాచార హక్కు చట్టం బోర్డు లేనందున పోస్టాఫీస్ ద్వారా అందించే సేవలు, ప్రభుత్వ పథకాలు, ఇతర సమాచారం తెలుసుకునేందుకు ఇబ్బందికరంగా ఉందన్నారు. తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

వర్షాలు కురవాలని బొడ్రాయికి జలాభిషేకం

నూతన్‌కల్, జూన్ 21: సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మండలంలోని ఎడవెల్లి గ్రామంలో మహిళలు బొడ్రాయికి శుక్రవారం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలతో ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు చేరుకుని శివుడికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు

మేళ్లచెర్వు, జూన్ 21: కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి జి. శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు విత్తనాల షాపులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవోశ్రీనివాస్‌గౌడ్, ఏఈవో నాగరాజు పాల్గొన్నారు.

రూ.10కోట్లతో మునిసిపాలిటీ అభివృద్ధి


తిరుమలగిరి మునిసిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు

తిరుమలగిరి, జూన్ 21: తిరుమలగిరి మునిసిపాలిటీని రూ.10కోట్లతో అభివృద్ధి చేస్తానన్ని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. తెలిపారు. శుక్రవారం తిరుమలగిరి మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిలర్ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులను కౌన్సిల్ సభ్యులకు వివిధ శాఖల అధికారులు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మట్లాడారు. ప్రతి వార్డులో రూ.10లక్షల వ్యయంతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని, మునిసిపాలిటీని జిల్లాలోనే ఉత్తమ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. మునిసిపల్ కార్యాయలంలో గతంలో ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించిన ఉద్యోగులను తొలగించి, కొత్తవారిని తీసుకోవడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. విధులకు సరిగా హాజరుకాని టౌన్ ప్లానింగ్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. తొలిసారి చైర్మన్‌గా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న శాగంటి అనసూయ ఎమ్మెల్యే సామేలుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కమిషనర్ రామదుర్గారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

కోదాడ రూరల్, జూన్ 21: మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని కొమరబండ గ్రామంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసిన రూ.25లక్షలతో నిర్మించనున్న ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ముస్లింల సంక్షేమానికి అన్ని పథకాలను వర్తింపజేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇమాంలు, మౌజంల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాలు, షాదీఖానాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, టీపీసీసీ ప్రతినిధి సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎంఏ జబ్బార్, కౌన్సిలర్లు ఖదీర్, నెమ్మాది వీరబాబు, మామిడి పద్మావతి, సంపెట రవి, దేవమణి పాల్గొన్నారు.


ఖబరస్తాన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను సాధించాలి


కోదాడలో జయశంకర్ చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు

కోదాడ టౌన్, జూన్ 21: ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను సాధించాలని కోదాడలో పలువురు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి డాక్టర్ బ్రహ్మం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జయశంకర్ త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకు జయశంకర్‌కు పేరు ప్రఖ్యాతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సాగర్ ఎడమ కాల్వ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, తెలంగాణ ఉద్యమ నాయకుడు రాయపూడి వెంకటనారాయణ, కౌన్సిలర్లు గుండెల సూర్యనారాయణ, ఎస్‌కే షఫీ, గంధం యాదగిరి, బాగ్దాద్, బషీర్, మోత్కూరు వీరభద్రాచారి, కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు రేపూరి సత్యనారాయణ, పంది తిరుపతయ్య, ప్రకాష్, నరసింహాచారి, గురువారెడ్డి, అంజయ్య చారి, సీతారామచారి, దేవాచారి, తిరుపతిచారి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు సాధించాలని బీసీ సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, గోవిందరావు, నరసింహాచారి, శేఖర్, వెంకటేశ్వర్లు, గురవయ్య, వర్మ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ధూళిపాళ ధనుంజయనాయుడు, రాపోలు నవీన్, తక్కెళ్ల నాగార్జున్, తునికిపాటి జగన్నాథాచారి, రావుల సత్యం, సతీష్‌రెడ్డి, ఊదర వెంకన్న, కొమ్మరాజు వెంకట్, పాల్గొన్నారు.

చిలుకూరు: మండలంలోని పాలెఅన్నారం జిల్లా పరిషత్ పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి హెచ్‌ఎం గుజ్జుల నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు.

నడిగూడెం: మండల కేంద్రంలని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సోమయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి: ప్రజల్లో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రొఫెసర్ జయశంకర్ నింపారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలంయాదవ్, గుండగాని రాములు గౌడ్, గోపగాని శ్రీనివాస్, తడకమళ్ల రవికుమార్, సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు.


నేరేడుచర్లలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

'విద్యుత్ సమస్యను పరిష్కరించాలి'

గరిడేపల్లి, జూన్ 21: మండలంలోని కీతవారిగూడెంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ చాంద్ మియా కోరారు. ఈ మేరకు మండల విద్యుత్ అధికారి రాయిరాల నగేష్‌కు శుక్రవారం వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ గ్రామంలో సబ్‌స్టేషన్ ఉన్నా విద్యుత్ సరఫరాకు తగిన విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు లేనందున గ్రామంలో లోవోల్టేజి సమస్య ఏర్పడి టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు కాలిపోతున్నాయన్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఏరియాకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, తీగలు అందించిన లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తానని విద్యుత్ అధికారి నగేష్ హామీ ఇచ్చినట్లు చాంద్‌మియా తెలిపారు.

భూసమస్యలను పరిష్కరిస్తా: ఆర్డీవో

మఠంపల్లి, జూన్ 21: మండలంలోని భూసమస్యలను పరిష్కరిస్తానని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, భూసమస్యల దరఖాస్తులను పరిశీలించారు. ఎన్‌సీఎల్ రైల్వే లైన్‌లో భూసమస్యతో పాటు భోజ్యతండా, రామచంద్రాపురంతండా, చెన్నాయిపాలెం రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. కార్యాలయానికి వచ్చే రైతుల అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ మంగారాఠోడ్‌ను ఆదేశించారు. 'ధరణి' దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గిరిప్రసాద్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఫిరాయింపులను ప్రోత్సహించడం దురదృష్టకరం

కోదాడ టౌన్, జూన్ 21: పార్టీ ఫిరాయింపులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సహించడం దురదృష్టకరమని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఇంటికి వెళ్లి పార్టీ ఫిరాయింపును ప్రోత్సహించడం రాజకీయ చరిత్రలో చీకటి రోజు అని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని రేవంత్‌రెడ్డి తన వాగ్దాటితో రెచ్చగొట్టి సీఎం అయ్యారన్నారు. రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి చూస్తుంటే ఏపీని వదిలిన గ్రహణం తెలంగాణను పట్టుకుందనే భావన కలుగుతోందన్నారు. అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకంగా రాబోయే కాలంలో ప్రజాస్వామ్యవాదులందరూ ఉద్యమాల బాట పట్టాల్సిన అవసరం ఉందన్నారు.

స్థలం కేయించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కోదాడ, జూన్ 21: ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్(ఐవీవో) ఆధ్వర్యంలో కోదాడలో 100అడుగుల జాతీయ జెండాను ఏర్పాటుచేసేందుకు స్థలం కేటాయించినందుకు ఐవీవో స్టేట్ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావు ఎమ్మెల్యే పద్మావతికి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే పద్మావతికి రెండు రోజుల క్రితం వినతిప్రతం ఇవ్వగా, పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో కార్గిల్ యుద్ధ వీరుడు గోపయ్యాచారి విగ్రహం పక్కన స్థలాన్ని కేటాయించారన్నారు. సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి స్థలాన్ని కేటాయించినందుకు ఐవీవో సభ్యులు జగని ప్రసాద్, గుండవునేని నాగేశ్వరరావు, వెంకన్న, ఉపేందర్‌రావు, సేకు రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

తారక్‌నాథ్ సేవలు చిరస్మరణీయం

కోదాడ టౌన్, జూన్ 21: ఎస్‌బీఐ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తారక్‌నాథ్ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు బ్యాంకు ఉద్యోగులు అన్నారు. ఎస్‌బీఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కోదాడలో ఎస్‌బీఐ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో తారక్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనాథాశ్రమంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, వెంకటరత్నం, చిట్టిబాబు, షరీఫ్, సూర్య, దేవదాసు, నందనరెడ్డి, పవన్‌శర్మ, ఉమామహేష్, రాము, అరుణ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి

మఠంపల్లి, జూన్ 21: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా కోరారు. మండలంలోని గుర్రంబోడుతండా, కృష్ణతండా, భీమ్లాతండా, భోజ్యతండా, రామచంద్రాపురంతండాలో శుక్రవారం నిర్వహించిన జీపీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఇంటి రవి, భూక్యపాండునాయక్, భూక్య సైదానాయక్, లక్ష్మి, నాగలక్ష్మి, కోటానాయక్, సీత, సోములు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సూర్యాపేట టౌన్: నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టుతో విచారణ చేయించాలి పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ కరోరారు. జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడిని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సూరం విజయ్‌రెడ్డి, ఉపేందర్, వీరేష్, వీరబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పూజారులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: బూరుగడ్డ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవిని అలంకరించి అర్చనలు నిర్వహించారు.అనంతరం గోపూజ చేశారు. కార్యక్రమంలో మీనారెడ్డి, ధనలక్ష్మి, లక్ష్మణ్‌రావు, గోపాలం పాల్గొన్నారు.

● ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మీసాల వీరబాబు, తుమ్మ సతీష్ కోరారు. పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆదినారాయణ, అబ్రహం పాల్గొన్నారు.

నేరేడుచర్ల: రచయిత్రి అరుంధతీరాయ్‌పై పెట్టిన కేసులను కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు

నడిగూడెం: అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.మురళికృష్ణ కోరారు. ఈ మేరకు ఎంఈవో ఎండీ సలీంషరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు.

● సమీకృత వ్యవసాయంతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని ఆదర్శ రైతు వి.శేషకుమార్ అన్నారు. నాబార్డు సహకారంతో మండలంలోని సిరిపురంలో సాగు చేస్తున్న సమీకృత వ్యవసాయాన్ని పొదుపు సంఘాల మహిళలు పరిశీలించారు. సమీకృత సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి కవిత మహిళలు పాల్గొన్నారు.

కోదాడ: ఈనెల 28న తేదీన నిర్వహించే 'చలో హైదరాబాద్'ను విజయ వంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బానోతు బాబు నాయక్ కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి, పి తిరుపతయ్య, ఎస్ఎస్‌రావు, గంగాధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: పట్టణంలోని బాలాజీనగర్ గిరిజన బాలికల వసతి గృహంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన బానోత్ గోపీనాయక్ సన్మాన కార్యక్రమాన్ని వసతి గృహ సంక్షేమ అధికారి వంగపల్లి పద్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాయక్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సైదానాయక్, హాజీనాయక్, హనుమానాయక్, బాలాజీ, జగ్గు, మణిరాం పాల్గొన్నారు.

తుంగతుర్తి: దివంగత సీపీఎం నేత తొట్ల మన్సూర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కరివిరాల, కొత్తగూడెం గ్రామాల్లో కల్లుగీత కార్మికులను కలిసి మాట్లాడారు. నూతనకల్ మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఈనెల 23నమన్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పులుసు సత్యం, అబ్బగాని భిక్షం, రమేష్, లింగయ్య, వెంకన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

●అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో శేషుకుమార్ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అత్యవసర పనులపై మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో బోయిని లింగయ్య, ఏటీఎం నరసయ్య, సీసీ గడ్డం గిరి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన అంకిరెడ్డి రాజారాంను పాల సొసైటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా పాల్వాయి చిరంజీవి, కేశగాని నర్సయ్య, కోనేటి కళమ్మ, గోసుల రాములు, టి.నర్సయ్య, గద్దగూటి ఎల్లయ్య, కేసాని అరుణ, బొడ్డు రామచంద్రు, కాసాని రాంబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఖమ్మంపాటి వెంకటేష్, మహేశ్వర్, జలేందర్, లక్ష్మీనర్సు, సత్తయ్య రామనర్సయ్య పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వేముల రామకృష్ణ వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ కింద ఎమ్మెల్యే మందుల సామేలు రూ1.70లక్షల ఎల్వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు.

● సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని నాగారం ఎస్ఐ పి. వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్‌రాములు, కానిస్టేబుల్ యల్లయ్య, హోంగార్డు లింగయ్య, వీరునాయక్, కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, గోపి, కృష్ణాచారి, గురులింగం పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండల కేంద్రం నుంచి చిల్పకుంట్ల మీదుగా తుంగతుర్తి వెళ్లే రహదారిని పునర్నిర్మాణం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాళ శంకర్‌రెడ్డి అధికారులను కోరారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రహదారి గుంతలమయంగా ఉండడంతో ఈ రహదారి నుంచి వెళ్లే ఉప్పల్ బస్సును అధికారులు నిలిపివేశారన్నారు. సమావేశంలో లక్ష్మయ్య, అచ్చయ్య, వెంకన్న, లింగయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని తొండ గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధనను ఎంఈవో శాంతయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధిస్తారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు.

చివ్వెంల: జిల్లా కేంద్రంలోని కుడకుడలో బైకు దొంగలను చివ్వెంల పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. కొంత కాలంగా చివ్వెంల మండలంలోని పలు గ్రామాల్లో, జిల్లా కేంద్రంలోని పలుచోట్ల బైకులు ఇటీవల దొంగతనాలకు గురయ్యాయి.